క్లుప్తంగా

కంచి గరుడసేవకు ఏర్పాట్లు



భక్తులతో సమావేశమైన ఆలయ ఈఓ

నగరి: స్థానిక కరియా మాణిక్యస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీ గురువారం నిర్వహించనున్న కంచి గరుడసేవకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ అధికారి రమణ తెలిపారు. బుధవారం ఆలయంలో భక్తులతో సమావేశమైన ఆయన గరుడసేవ వివరాలను వెల్లడించారు. భక్తులు మాట్లాడుతూ పట్టణ దాతల సహకారంతో పోస్టర్లు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లను ఏర్పాటు చేస్తామని అధికారులకు సూచించారు. వాహన మోత సిబ్బందికి, ఇతర పనులకు సహకారం అందిస్తామన్నారు.

వడదెబ్బపై జాగ్రత్తలు పాటించండి

నింద్ర: వడదెబ్బపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారులు సుమలత, వినిషా సూచించారు. బుధవారం స్థానిక వైద్యశాలలో ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. వారు మట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు వడదెబ్బపైన అవగాహన కల్పించాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం వలన దీర్ఘ కాలపు జబ్బులు వున్నవారు, గర్భిణులు, చిన్నపిల్లలకు వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. వీరంతా ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బైట తిరగరాదని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్‌ఓ శ్రీదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు సురేష్ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ విద్యాలయానికి గాజంకి విద్యార్థి ఎంపిక



భానుప్రకాష్

కార్వేటినగరం: మండలంలోని గాజంకి దళితవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి కె.భానుప్రకాష్ ఏపీ రెసిడెన్షియల్ విద్యాలయానికి ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం రూప తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గత నెల 25వ తేదీ నిర్వహించిన ఏపీ ఆర్‌ఎస్ క్యాట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, వంద మార్కులకు 80 మార్కులు సాధించి ఏపీ రెసిడెన్షియల్ విద్యాలయంలో ఓపెన్ కేటగిరిలో సీటు సాధించాడని తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ నిమజ్జనం



టి.పుత్తూరులో గంగమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో భక్తులు భక్తిశ్రద్ధలతో గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. గంగమ్మ తల్లి జాతరను మంగళ, బుధవారాల్లో వేడుకగా భక్తితో జరుపుకున్నారు. గ్రామంలోని సతమ్మ తల్లికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. రాత్రిలో గంగమ్మను ప్రతిష్ఠాపన చేసి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. బుధవారం యువకులు ఉట్లోత్సాహం జరుపుకున్నారు. అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

మాతా శిశు మరణాలను కట్టడి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్(కాణిపాకం): మాతా శిశు మరణాలను కట్టడి చేయాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో బుధవారం మాతా శిశుమరణాలపై సమావేశం నిర్వహించారు. మాతృ మరణాలు జరగకుండా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఐఓ రవిరాజు, వైద్యాధికారులు ఉషశ్రీ, లత, మాలతి, జానకీరావు, శిరీష పాల్గొన్నారు.

పేట్రేగుతున్న కేబుల్ చోరీ దొంగలు

పలమనేరు: మండలంలోని అటవీ సమీప గ్రామాల్లో వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ దొంగలు పేట్రేగుతున్నారు. మూడునెలలుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. తాజాగా పెంగరగుంట పంచాయతీలో ఏటిగడ్డిండ్లు, ముసలి మొడుగు, కృష్ణాపురం గ్రామాల్లో పలువురు రైతుల వ్యవసాయ బోర్ల వద్ద రూ.వేల విలువైన మోటార్ కేబుళ్లు చోరీ అయ్యాయి. బాధిత రైతులు పోలీసులకు ఇప్పటికే ఫిర్యాదులు చేశారు. మదనపల్లె ప్రాంతానికి చెందిన ఓ ముఠా ముసలిమొడుగు సమీపంలో ఉంటూ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

సరదా సరదా..సెలవులు

- పిల్లలు..పెద్దలతో కిటకిటలాడుతున్న పార్కు



పార్కులో కుటుంబసమేతంగా..

పుత్తూరు: గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణ ప్రజలు వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తున్నారు. ఇందుకు పట్టణంలో ఏర్పాటైన మున్సిపల్ పార్క్ వేదికైంది. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత ఈప్రభుత్వంలో పుత్తూరులో తొలిపార్కు ఏర్పాటైంది. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం ఇక్కడికి వచ్చి సరదాగా గడుపుతున్నారు. వేసవి సెలవులు కావడంతో ప్రతిరోజూ పిల్లలు, పెద్దలతో పార్కు కోలాహలంగా ఉంటోంది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో, ఎన్నికల ప్రచారంలో తలమునకలైన వారు సైతం కుటుంబసమేతంగా పార్కు బాటపట్టి సేదదీరుతున్నారు. నూతనంగా 16 ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేయడంతో విద్యుత్ కాంతుల వెలుగుల్లో పార్కు వెలిగిపోతోంది. దీంతో రాత్రి 8గంటల వరకు పార్కులోకి అనుమతిస్తున్నారు. పెద్దలు పచ్చని మొక్కల మధ్యన సేద తీరగా, పిల్లల ఆనందానికి హద్దే లేకుండి. తమకోసమే ఏర్పాటు చేసిన ఆటవస్తువులతో ఆడుతూ పాడుతూ సరదా సరదాగా గడుపుతున్నారు. ఈ దృశ్యం చూడ ముచ్చటగా ఉంది. రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధులు పచ్చని చెట్ల మధ్య ప్రశాంత వాతావరణంలో స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ, సేదదీరుతున్నారు. యువకులు జిమ్‌తో సాధనలు చేయగా, యువకులు, వృద్ధులు వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. అందరికీ అన్ని విధాలుగా ఏంతో హాయిని, ఆహ్లాదాన్ని ఇచ్చే ఉద్యానవనం అందుబాటులోకి రావడంతో ప్రజలు సంతోషంగా ఎంజాయ్ చేస్తున్నారు. అలాగే ఎప్పటికప్పుడు పార్కును అందంగా మెరుగుపరుస్తుండడంతో పట్టణ ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారు ఇక్కడికి వస్తుండడంతో పార్కు కిటకిటలాడుతోంది.



పిల్లల సరదా సరదా ఆటలు



జిమ్‌లో జోరుగా హుషారుగా

నరసింహారెడ్డికి నివాళి



నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): డిప్యూటీ సీఎం కె. నారాయణస్వామి వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు మహాసముద్రం నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పెనుమూరు మండలం పులికల్లులో బుధవారం జరిగిన నరసింహారెడ్డి ఉత్తర క్రియలకు డిప్యూటీ సీఎం హాజరుయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహారెడ్డికి వైఎస్సార్ సీపీ అన్నా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నా ఎనలేని అభిమానం అన్నారు. రెండుసార్లు తన గెలుపునకు నరసింహారెడ్డి ఎంతో కృషిచేశారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుడ్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కంట తడి పెట్టుకున్నారు. అలాగే గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ కూడా నరసింహారెడ్డి ఉత్తర క్రియలకు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సత్యవేడు నియోజక వర్గం పరిశీలకులు మహాసముద్రం దయాసాగరరెడ్డి, పారిశ్రామికవేత్త కిరణ్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ హేమలత రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజయకుమార్ రెడ్డి, మాజీ కన్వీనర్ సురేష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి, పార్టీ మహిళ విభాగం నియోజకవర్గం అధ్యక్షురాలు యశోదారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు గోవిందరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, ఏఎంసీ చైర్మన్ కమలాకరరెడ్డి, వైస్ ఎంపీపీలు కోదండన్, జ్యోతి, సర్పంచ్‌లు దూది వెంకటేశులు, కోదండరామిరెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

కదలివచ్చిన మహిళాలోకం



పోలింగ్‌రోజున ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు

- అత్యధికంగా ఓటుహక్కు వినియోగించుకున్న మహిళలు
- కర్ణాటక, తమిళనాడు నుంచి భారీగా తరలివచ్చిన ఓటర్లు

గంగాధర నెల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడానికి మహిళాలోకం పోటెత్తింది. మహిళా ఓటర్లే అధికశాతం తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. గత ఐదేళ్లలో సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యత ఇవ్వడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలవగా, మహిళలకు జగనన్న చేసిన మేలును వారు మరువలేదు. ఓటు హక్కుతో మళ్లీ అభివృద్ధికే పట్టం కడతామని చెబుతున్నారు. సోమవారం రోజున ఓటింగ్ ప్రారంభం కాక మునుపే భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాల వద్దకు మహిళలు పింఛన్ లబ్ధిదారులు అధిక సంఖ్యలో పోటెత్తారు. గంట, రెండు గంటలకు పైగా క్యూలో నిలుచుని తమకు మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి వేచి ఉండి మరీ ఓటుహక్కు వినియోగించుకున్నారు. గంగాధరనెల్లూరు మండలంలో ఎప్పుడూ లేనివిధంగా ఓటింగ్ శాతం అధికంగా నమోదు కావడంతో అభివృద్ధికి మళ్లీ పట్టం కడతారని అభిమానులు చర్చించుకుంటున్నారు. కర్ణాటక తమిళనాడు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా ఓటర్లు తరలివచ్చారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి థామస్ పోలింగ్ రోజు పలు కేంద్రాల్లో సందర్శిస్తూ తెలుగుదేశం పార్టీ వారిని వైఎస్సార్ సీపీ వారిపై గొడవలు, దౌర్జన్యాలు చేయమని ప్రోత్సహించారు. చెదురుమదురు ఘటనలతో తప్ప మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. థామస్ వ్యక్తిగత కార్యదర్శి దాము జంగాలపల్లెలోని పోలింగ్ బూత్‌లోకి వెళ్లి తలుపు వేసుకోగా గ్రామస్తులు తిరగబడి దేహశుద్ధి చేసి, తరిమేశారు. అనంతరం థామస్ వ్యక్తిగత కార్యదర్శి తమ అనుచరవర్గంతో గ్రామస్తులపై దాడి చేయడానికి ప్రయత్నించగా గ్రామస్తులు తిరగబడి ఎదురుదాడి చేశారు. గంగాధరనెల్లూరు మండలంలో ప్రశాంతంగా పోలింగ్ జరగడంతో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతాడని, వైఎస్సార్ సీపీ అభ్యర్థి అధిక మెజారిటీతో గెలవబోతున్నారన్న సూచనలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

నేటి నుంచి కోనేటి రాయస్వామి బ్రహ్మోత్సవాలు

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీకోనేటిరాయస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా, ప్రసార మాధ్యమాలకు దూరంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. బుధవారం సాయంత్రం వేద మంత్రోచ్ఛరణల నడుమ అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం పెద్ద శేషవాహనంలో శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీస్వామివారు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు.17వ తేదీ ఉదయం 10 గంటలకు చిన్న శేష వాహనం, రాత్రి 7గంటలకు హంస వాహనం, 18వ తేదీ ఉదయం 10 గంటలకు సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 19వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం 20వ తేదీ ఉదయం మోహినీ ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి గరుడ సేవ ఉంటుంది. 21వ తేదీ ఉదయం హనుమంత వాహనం, మధ్యాహ్నం వసంతోత్సవం, రాత్రి గజ వాహనం, 22వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి చంద్రప్రభ వాహనం, 23వ తేదీ ఉదయం రథోత్సవం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి అశ్వ వాహనం, 24వ తేదీ ఉదయం తిరుచ్చి ఉత్సవం, చక్రస్నానం రాత్రి ధ్వజావరోహణం, పూర్ణాహుతి, 25వ తేదీ చివరి రోజు పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి. 20వ తేదీ కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు నిర్ణయించిన రుసుం చెల్లించి సంప్రదాయ దుస్తులతో దంపతులిద్దరు పాల్గొనవచ్చని ఆలయ టీటీడీ అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గ్రామాల్లో వెల్లివిరిసిన చైతన్యం



విజయపురంలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

- ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగం
- నియోజకవర్గంలో 1,76,399 మంది
- చల్లబడుతున్న ఎన్నికల వేడి

నగరి: ఐదేళ్లకోసారి వచ్చే ఓటేసే అవకాశాన్ని ఓటర్లు చేజార్చుకోలేదు. ఎక్కడెక్కడి నుంచో రెక్కలు కట్టుకొని మరీ సొంతూరులో వాలారు. ప్రయాణం భారమనుకోలేదు. ఎండను లెక్కచేయలేదు. ఇంటింటా ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. యువత, మహిళ, వృద్ధులు అన్న తేడా లేకుండా ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు కదలి వెళ్లారు. చూపుడువేలితో తమ భవిష్యత్తును నిర్ణయించే నేతను ఎన్నుకున్నారు. గంటల తరబడి క్యూలో నిలవాల్సి వచ్చినా వెనుదిరిగి వెళ్లకుండా ఓపిగ్గా వేచి చూసి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 185 ప్రాంతాల్లో 231 పోలింగ్ స్టేషన్లలో 2,02,574 మంది ఓటర్లు ఉండగా 1,76,399 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 87.08 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకోగా వారిలో 86,078 మంది పురుషులు, 90,316 మంది స్త్రీలు, ఇతరులు 5 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సంక్షేమ పథకాలు నేరుగా కుటుంబాలకు లబ్ధి చేకూర్చడంతో కులాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా మహిళలు విధేయతతో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న మాటలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అలాగే నెల నెలా ఒకటో తేదీన తెల్లవారుతుండగానే వలంటీర్లు ఇంటి తలుపులు తట్టి మరీ వృద్ధాప్య పెన్షన్లు సొమ్ము చేతిలో పెడుతున్న సానుకూల పరిణామం కూడా వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు రప్పించిందన్న అభిప్రాయం అందరి నుంచి వ్యక్తమవుతోంది. పైగా గతప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల్లో కోత తప్పదన్న భయం ప్రజల్లో నెలకొనడం సైతం ఓటింగ్ పెరగడానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి క్షణం తీరికలేకుండా గడిపిన అభ్యర్థులు ఓటర్ల మనసు గెలుచుకునేందుకు సర్వశక్తులు ఒడ్డారు. పోటీలో గెలిచిన అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంటింటి ప్రచారంలో బిజీబిజీగా గడిపారు. సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో వర్గవిభేదాలతో గ్రామాల్లో వేడెక్కిన రాజకీయం చల్లబడుతోంది. ఏయే బూత్‌లలో ఎవరికెన్ని ఓట్లు పడ్డాయో, ఏయే గ్రామాల్లో ఎంతెంత మెజారిటీ వస్తుందోనన్న లెక్కల్లో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మునిగి తేలుతున్నారు. ఎన్నికల్లో ప్రత్యర్థిని ఎదుర్కోవడం కోసం వ్యూహ, ప్రతివ్యూహాలతో గడిపిన అభ్యర్థులు ఎన్నికలు పూర్తి కావడంతో ఎన్నికల సరళిపై అంచనాలు వేసుకుంటున్నారు. పోలింగ్ జరిగిన సరళి, గత ఎన్నికల్లో వచ్చినంత పోలింగ్ శాతం ప్రస్తుతం కూడా రావడం, మహిళలు ఎక్కువ శాతం ఓటు హక్కు వినియోగించుకోవడం వైఎస్సార్‌సీపీ విజయాన్ని సూచిస్తోందని విశ్లేషకులు తెలుపుతున్నారు.

ధ్వజ స్తంభానికి పంచలోహ తాపడం



ధ్వజాస్తంభానికి పంచలోహ తాపడం చేసిన దాతలను సన్మానించి, జ్ఞాపిక అందజేస్తున్న ధర్మకర్తలు

కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లిలో ఉన్న ద్రౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయ ధ్వజస్తంభానికి జీలావారికండ్రిగ గ్రామానికి చెందిన హనుమంతయాదవ్ కుటుంబసభ్యులు పంచలోహ తాపడం చేయించారు. ఇందుకోసం వారు రూ.4లక్షలు వెచ్చించారు. ఈ సందర్భంగా బుధవారం వేకువజామున ద్రౌపదీసమేత ధర్మరాజుల వారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ద్రౌపదీసమేత ధర్మరాజులవారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలతో విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు హనుమంతయాదవ్ కుటుంబ సభ్యులు అన్న ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా దాత హనుమంతయాదవ్ మాట్లాడుతూ గత సంవత్సరం వార్షిక మహా భారత ఉత్సవాలను పురస్కరించుకుని రూ.10 లక్షలు వెచ్చించి, ధ్వజస్తంభం ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది కూడా ధ్వజస్తంభానికి రూ.4 లక్షలతో వెండి తాపడం చేయించానని చెప్పారు. ఈ క్రమంలో భాగంగా హనుమంతయాదవ్ కుటుంబసభ్యులను ఆలయ ధర్మకర్తలు శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. నందిబోయని మునిసుబ్రమణ్యం, మునిలక్ష్మి, భారతి, సాయి యాదవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథాగానం

కత్తెరపల్లిలో ఉన్న ద్రౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయంలో జరిగే వార్షిక మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం భాగవతారిణి శ్రీమతి సుమతి ఆలపించిన హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. అంతకుముందు ఉదయం ఆలయ ఆవరణలో ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి రాత్రి వీధి నాటకం ఉంటుందని ధర్మకర్తలు తెలిపారు.

కొనసాగుతున్న రోజమ్మ దాతృత్వం



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

- పుత్తూరు ఆస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం తింటున్న గర్భిణులు

పుత్తూరు: రోజమ్మ తన దాతృత్వాన్ని కొనసాగిస్తున్నారు. గత కొన్నేళ్లుగా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి బుధవారం చికిత్స నిమిత్తం వచ్చే వందలాది గర్భిణులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని నేటి బుధవారం కూడా మంత్రి ఆర్కేరోజా కొనసాగించారు. పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు మాట్లాడుతూ మంత్రి రోజా ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాకుండా, నిజంగా మాలాంటి పేద మహిళల ఆకలి తీర్చడం హర్షణీయమన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ఆమె మాకు మంచి భోజనం అందించడం ఆమె మంచి మనసుకు నిదర్శనమన్నారు. తాత్కాలిక తాయిళాలు ఇచ్చి మభ్యపెట్టే రాజకీయ నాయకులు అడుగడుగునా కనిపిస్తుంటారని, అలాంటి వారి మధ్యన రోజా లాంటి వారు అరుదుగా ఉంటారని కొనియాడారు. కడుపు నిండా మంచి భోజనం పెడుతున్న మంత్రి రోజమ్మ మేలు మరువలేవమని పలువురు గర్భిణులు వ్యాఖ్యానించారు. బుధవారం స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా వెజిటబుల్ లావ్, వైట్‌రైస్, గుడ్డు, కర్రీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. ఆస్పత్రి డెవలప్‌మెంట్ మెంబర్ జి.నారాయణస్వామి పాల్గొన్నారు.

తాటి ముంజెలతో ఉపశమనం

- వేసవిలో మాత్రమే అందుబాటులో
- ఆరోగ్యానికి ఎంతో మేలు
- రోడ్డు పక్కన విక్రయాలు
- పలువురికి జీవనోపాధి



ఐరాలలో తాటిముంజెలు విక్రయిస్తున్న దృశ్యం

ఐరాల: తాటిచెట్టులోని అన్ని భాగాలు మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయి. తాటి బోదెను కలపగాను, ఆకులు ఇళ్లపైకప్పుగాను, విసనకర్రలుగానూ, తాటిముంజెలు, తాండ్ర, బెల్లం, కల్లు ఇలా ప్రతిదీ ఉపయోగపడేదే. తాటి చెట్టు నుంచి లభించే తాటికాయలకు వేసవిలో మంచి డిమాండ్ ఉంటుంది. ఆ కాయల్లో తాటి ముంజెలు లభిస్తాయి. వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి మానవాళికి ప్రకృతి ప్రసాదించిన వరం ఈ తాటి ముంజెలు. వేసవిలో ముంజెలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది. వేసవి సీజన్‌లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మాత్రమే దొరికే ఈ తాటిముంజెలు ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో నిమిత్తం లేకుండా దారిపొడువునా లభిస్తున్నాయి. తాటిముంజెలు అమ్మకం కోసం రోడ్డు పక్కన పెట్టిన గంటల వ్యవధిలోనే అమ్ముడుపోతున్నాయి.

రోడ్డు పక్కన విక్రయాలు

తాటిముంజెలు ఎప్పుడంటే అప్పుడు దొరికేవి కావు. వేసవి కాలంలోనే ఇవి కాస్తాయి. ప్రస్తుతం వాటిని మండల కేంద్రంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలోని బజారు వీధి, వారపు సంత, జెండామాను వీధి, వీఎస్.అగ్రహారంలో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. మండలంలోని చెంగనపల్లెకు చెందిన పలువురు యువకులు రోడ్డు పక్కన తాటిముంజెలు విక్రయిస్తారు. మండలంలో విక్రయదారులు డజను తాటిముంజెలను రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ 50 నుంచి 70 డజన్లు అమ్ముతున్నట్లు చెబుతున్నారు. తాటిముంజెలను గంపల్లో తెచ్చి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

అనేక పోషకాలు

వేసవి తీవ్రత కారణంగా మన శరీరంలో పోయే అనేక పోషకాలను కొబ్బరినీరుతోపాటు తాటి ముంజెలు తిరిగి అందిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వంద గ్రాముల తాటిముంజెలో 92.5 గ్రాముల తేమ, 9.4 గ్రాముల కార్బోహైడ్రేటులు, 9.6 గ్రాముల ప్రోటీన్లు, 0.2 గ్రాముల పీచు పదార్థాలు, 0.1 గ్రాము కొవ్వు, 61 మి.గ్రా ఆమ్లం, 12 మి.గ్రా కాల్షియం, 21 మి.గ్రా ఫాస్పరస్, 0.3 మి.గ్రా ఇనుప దాతువు ఉంటాయి. వీటిని తీసుకోవడం వలన వేసవి తాపం తీరడంతో పాటు శరీరానికి అవసరమైన కేలరీలు లభిస్తాయి. అంతేకాక వీటిని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా కూడా ఉపయోగిస్తుంటారు.